క్లుప్తంగా

డాక్టర్ ఖాదర్ వలీకి సన్మానం నేడు

ఎంవీపీ కాలనీ: మిల్లెట్ ఆహారంపై విశేష కృషి చేసిన పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ ఖాదర్ వలీకి సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నట్టు గో ఆధారిత ప్రకృతి పంటల రైతు సంఘం సంఘం చైర్మన్ పీఎల్ఎన్ రాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం సాయంత్రం 4 గంటలకు మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియం వేదికగా ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. తొలుత సాయంత్రం డాక్టర్ ఖాదర్ వలీ ప్రసంగం ఉంటుందని, అనంతరం పౌర సన్మానం చేస్తామని తెలిపారు.

ఉత్సాహంగా 2కే రన్



తెన్నేటి పార్కు వద్ద 2కే రన్ ప్రారంభిస్తున్న వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ శుభ

ఆరిలోవ: నగరంలో జరగనున్న జీ–20 సదస్సు, భారత్‌కు మద్దతుగా ఆర్‌బీఐ ఆంధ్రప్రదేశ్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం తెన్నేటి పార్కు రోడ్డులో చేపట్టిన 'భగీదరి–2కే రన్'ఉత్సాహంగా సాగింది. వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 101 గవర్నర్ ఉప్పలపాటి శుభ బెలూన్లు ఎగురు వేసి రన్‌ను ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హాజరైన విశాఖ పోర్టు చైర్మన్ కె.రామమోహన్‌రావు మాట్లాడుతూ జీ–20 సదస్సుకు మద్దతుగా ఈ కార్యక్రమం చేపట్టిన నిర్వాహకులను అభినందించారు. ఆర్‌బీఐ జీఎం శివాజీ రాధాకృష్ణన్, అంజనీ మిశ్రా, వాకర్స్ క్లబ్ సభ్యులు, నగరవాసులు, యువత అధిక సంఖ్యలో ఈ రన్‌లో పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్‌లో రగడ

ఆరిలోవ: జాతీయ రహదారి పక్కన ఎండాడ వద్ద పెట్రోల్ బంక్‌లో హడావిడి జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఆదివారం సాయంత్రం ఎండాడకు చెందిన ముగ్గురు యువకులు ద్విచక్ర వాహనంపై బంక్‌కు వెళ్లారు. అక్కడ పెట్రోల్ కొట్టించుకొని డబ్బులు ఫోన్‌పే చేస్తామన్నారు. పెట్రోల్ కొట్టే బాయ్ ఫోన్‌పే లేదని చెప్పడంతో వారి మధ్య వాదన జరిగింది. ఈ విషయం గమనించిన బంక్ యజమాని అక్కడికి చేరుకుని బైక్‌లో వేసిన పెట్రోల్‌కు సరిపడా డబ్బులు ఇవ్వాల్సిందేనని చెప్పారు. దీంతో ఆగ్రహించిన ఆ యువకులు గొడవకు దిగారు. బంక్ క్యాబిన్ అద్దాలు పగలుగొట్టారు. బంక్ యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు గొడవకు దిగిన ముగ్గురు యువకులను ఆరిలోవ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేయలేదు.

30న సీతారాముల కల్యాణోత్సవం



సీతారాముల కల్యాణ ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీరామ నవమిని పురస్కరించుకుని ఈనెల 30న సింహగిరిపై పురాతన రామాలయంలో సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహిస్తున్నట్టు వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఈవో వి.త్రినాథరావు ఆదివారం తెలిపారు. ఆరోజు ఉదయం 10.30 గంటలకు ఆలయ ప్రాంగణంలో కల్యాణం నిర్వహించడం జరుగుతుందన్నారు. భక్తులంతా కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు. అలాగే సింహగిరిపై రాజగోపురం వద్ద ఉన్న కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని సీతారాముల సన్నిధిలో కూడా కల్యాణ మహోత్సవం ఉదయం 10.30గంటల నుంచి జరుగుతుందని పేర్కొన్నారు.

రహదారులు కళకళ



ఆహ్లాదాన్ని పంచే విధంగా డివైడర్ మధ్యలో ఏర్పాటు చేసిన పూల మొక్కలు



రాత్రి వేళ విద్యుత్ కాంతుల మధ్య బీచ్ రోడ్డు

ఆరిలోవ/ఎంవీపీ కాలనీ: నగర రహదారులు కళకళలాడుతున్నాయి. జీ–20 సదస్సు నిర్వహణలో భాగంగా వివిధ దేశాల ప్రతినిధులు విశాఖ తరలిరానున్న వేళ నగరాన్ని జీవీఎంసీ సుందరంగా తీర్చిదిద్దుతోంది. లాసన్స్‌బే కాలనీ, అప్పుఘర్‌లు ఆనుకుని కైలాసగిరి వరకు ఉన్న బీచ్ రోడ్డును జీవీఎంసీ అధికారులు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఫుట్‌పాత్‌లను సైతం ఆధునికీకరించారు. డివైడర్ మధ్యలో గ్రీనరీని పెంపొందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వివిధ రంగుల పూలు విరబూసే మొక్కలు కనువిందు చేస్తున్నాయి. విశాలాక్షినగర్, సమీపం సీతకొండ వద్ద ఏర్పాటు చేసిన సీ వ్యూ పాయింట్ సందర్శకులను ఆకట్టుకుంటోంది. ఇక్కడ జీవీఎంసీ ఏర్పాటు చేసిన 'ఐ లవ్ వైజాగ్'బోర్డు వద్ద సందర్శకులు ఆగి ఫొటోలు తీసుకుని ముచ్చటపడుతున్నారు. కొండ అంచున రాళ్లు, మొక్కల మధ్య విద్యుత్ దీపాలు అమర్చి అలంకరించారు. రాత్రి వేళ వాటి మధ్య విద్యుత్ కాంతులు ఆకట్టుకుంటున్నాయి.



కైలాసగిరి రోప్‌వే మలుపు వద్ద కళకళలాడుతున్న రహదారి

కాలుష్య రహిత రాష్ట్రమే సీఎం లక్ష్యం

నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు

బీచ్‌రోడ్డు: కాలుష్య రహిత రాష్ట్రమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు అన్నారు. బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ ఆధ్వర్యంలో విద్యుత్ క్యాంపెయిన్ రోడ్ షో నిర్వహించారు. ఆర్కేబీచ్ నుంచి వైఎంసీఏ వరకు సాగిన ఈ క్యాంపెయిన్‌ను కె.కె.రాజు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలుష్య రహిత ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడానికి తరగని ఇంధన వనరులు, స్థిరమైన సాంకేతికతను అన్ని రంగాలలో పెద్ద ఎత్తున అమలు చేయడానికి ప్రభుత్వం సంకల్పించిందన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు, నెడ్‌క్యాప్ ఎండీ ఎస్.రమణరెడ్డి పాల్గొన్నారు.



జెండా ఊపి విద్యుత్ క్యాంపెయిన్ రోడ్ షోను ప్రారంభిస్తున్న కె.కె.రాజు

రోడ్లపై యథేచ్ఛగా గృహ వ్యర్థాల డంపింగ్



స్కిల్ డెవెలప్‌మెంట్ ఎదురుగా రోడ్డు మీద వేసిన గృహ వ్యర్థాలు

ఆరిలోవ: రోడ్లపై గృహ వ్యర్థాలను ఓ పక్క తొలగిస్తున్నా.. మరో వైపు కొందరు లారీలతో తీసుకొచ్చి దిబ్బలుగా డంప్ చేస్తున్నారు. నగరంలో జీ–20 సదస్సు నిర్వహణ దృష్ట్యా రోడ్లు అద్దంలా మెరిసేలా అధికారులు శుభ్రం చేయిస్తున్నారు. అయితే పలువురు లారీలతో గృహ వ్యర్థాలను తీసుకొచ్చి రోడ్ల పక్కన పడేస్తున్నారు. ఈ వ్యర్థాలు కొన్నిచోట్ల రోడ్ల మధ్యలో వేస్తున్నారు. ఆరిలోవ కాలనీ సమీప హెచ్‌పీసీఎల్ స్కిల్ డెవలప్‌మెంట్ ఎదురుగా ఉన్న డబుల్ రోడ్డు పక్కన కొద్ది రోజుల క్రితం వేసిన వ్యర్థాలను జీవీఎంసీ అధికారులు చదును చేయించారు. చదును చేసిన వారం తర్వాత మళ్లీ అక్కడ గృహ వ్యర్థాలు వేసేశారు. దీంతో అక్కడ రోడ్డు మళ్లీ డెబ్రిస్ దిబ్బలతో నిండిపోయింది. అధికారులు కఠిన చర్యలు తీసుకోకపోవడంతో ఇష్టానుసారంగా డెబ్రిస్ వేసేస్తున్నారని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రత్యేక నిఘా పెట్టి గృహ వ్యర్థాలు డంప్ చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

హనుమంతవాక కూడలిలో తప్పిన ప్రమాదం

ఆరిలోవ: జాతీయ రహదారిపై హనుమంతవాక కూడలి వద్ద ఆదివారం సాయంత్రం పెద్ద ప్రమాదం తప్పింది. ఆగి ఉన్న వాహనాలపైకి ఓ కంటైనర్ లారీ దూసుకొచ్చింది. ఈ ఘటనలో నలుగురు స్వల్ప గాయాలతో బయటపడడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఆరిలోవ ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సాయంత్రం 4 గంటల సమయంలో మధురవాడ నుంచి నగరానికి వెళ్తున్న వాహనాలు హనుమంతవాక కూడలి వద్ద సిగ్నల్ పడడంతో ఆగాయి. భీమిలి నుంచి నగరానికి వెళ్తున్న 999 నంబరు ఆర్టీసీ సిటీ బస్ కూడా కూడలి వద్ద ఆగింది. దాని పక్కన పలు ద్విచక్ర వాహనాలు ఆగి ఉన్నాయి. అదే సమయంలో వెనక నుంచి వచ్చిన కంటైనర్ లారీ.. బస్సును ఢీకొడుతూ పక్క నుంచి దూసుకొచ్చింది. అంతేకాకుండా బస్సు పక్కన ఆగి ఉన్న మూడు ద్విచక్ర వాహనాలను కూడా ఢీకొంది. ఆయా బైకులపై వెళ్తున్న నలుగురు కిందపడి స్వల్ప గాయాలపాలయ్యారు. గాయపడిన వారిలో నాలుగేళ్ల చిన్నారి ఉంది. ద్విచక్ర వాహనాలు దెబ్బతిన్నాయి. ఆర్టీసీ బస్సు మధ్య భాగం నుజ్జయింది. ఈ ఘటనలో ప్రాణాపాయం లేకపోవడంతో ట్రాఫిక్ పోలీసులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. మితిమీరిన వేగంతో వచ్చిన కంటైనర్ లారీ ఆర్టీసీ బస్‌ను ఢీకొట్టడం వల్లే దాని వేగం తగ్గిందని, లేదంటే ద్విచక్ర వాహన చోదకుల పైకి దూసుకుపోయి పెద్ద ప్రమాదం జరిగేదని ప్రత్యక్ష సాక్షులు అంటున్నారు. ఈ ఘటనపై ఆర్టీసీ డ్రైవర్, ద్విచక్ర వాహనచోదకుల ఫిర్యాదు మేరకు కంటైనర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఆరిలోవ పోలీసులు తెలిపారు.



సిటీ బస్సును ఢీకొన్న కంటైనర్

ప్రభుత్వరంగ సంస్థలను పరిరక్షించాలి

కూర్మన్నపాలెం : దేశ స్వాతంత్య్రం తర్వాత ప్రభుత్వరంగ పరిశ్రమల వల్లనే దేశంలో ఆర్థికాభివృద్ధి విస్తరించిందని, కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణకు కృషి చేయాలి తప్ప మూసివేయడం తగదని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. విశాఖ ఉక్కు దీక్షలు ఆదివారం నాటికి 773వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా టీఎన్‌టీయూసీ కాంట్రాక్ట్ కార్మికులు దీక్షలో పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బడా వ్యాపారులకు దేశాన్ని తాకట్టు పెట్టేలా బీజేపీ వ్యవహరిస్తోందన్నారు. ఉక్కు ఉద్యమానికి కేంద్ర ప్రభుత్వం స్పందించే విధంగా కార్మికులు పోరాడాలన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరి వీడి స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించకుండా నిర్ణయం తీసుకోవాలన్నారు. దీక్షా శిబిరంలో పోరాట కమిటీ నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



దీక్షలో పాల్గొన్న ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు

'ప్రశ్నించే వారిపై బీజేపీ కేసులు'

సీతమ్మధార: బీజేపీ అవినీతిని ప్రశ్నించిన వారిపై అనర్హత వేటు వేసి కేసులు నమోదు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాకేష్‌రెడ్డి ఆరోపించారు. ఎంపీగా రాహుల్ గాంధీపై బీజేపీ ప్రభుత్వం అనర్హత వేటు వేయడాన్ని నిరసిస్తూ దేశవ్యాప్తంగా సత్యాగ్రహ దీక్ష నిర్వహించాలని పిలుపు మేరకు ఆదివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఇండియన్ డెమొక్రసీ బ్లాక్ డేగా సంకల్ప సత్యాగ్రహ దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిపక్షాలపై అప్రజాస్వామికంగా వ్యవహరిస్తుందన్నారు. ప్రధాని మోదీ, అదానీలపై ప్రశ్నించినందుకు రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేశారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు గొంప గోవిందరాజు, ఎం.లక్ష్మి, వేగి వెంకటేష్, లక్కరాజు రామారావు, సుధాకర్, జి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



దీక్ష చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో హరే కృష్ణ, హరేరామ నామస్మరణతో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

క్రికెట్ లీగ్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న క్లబ్ సభ్యులు

కొమ్మాది: రోటరీ క్లబ్, వైజాగ్ మెట్రో ఆధ్వర్యంలో ఏప్రిల్ 1 నుంచి పోర్టు స్టేడియంలో నిర్వహించనున్న రోటరీ క్రికెట్ లీగ్ పోస్టర్‌ను తిమ్మాపురంలో గల డి.రామానాయుడు ఫిల్మ్ స్టూడియోలో రోటరీ జిల్లా పూర్వ గవర్నర్లు మడిపిల్లి రామారావు, డి.వి.రాజు, రాజారెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. 15 క్లబ్‌లకు సంబంధించిన 7 జట్లు పాల్గొన్నాయి. కార్యక్రమంలో రోటరీ క్లబ్ మెట్రో అధ్యక్షులు సునీత లావణ్య, కార్యదర్శి గాయత్రి, వ్యవస్థాపక అధ్యక్షుడు మిథిలి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్టూనిస్టులకు సత్కారం



కార్టూనిస్టును సత్కరిస్తున్న ప్రతినిధులు

మల్కాపురం: కార్టూన్, కళా రంగంలో చేసిన సేవలకుగాను జీవన సాఫల్య పురస్కారాలు అందుకున్న పలువురి కార్టూనిస్టులను చిత్ర కళా సేవా సంస్థ, చిత్రకళా పరిషత్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కార్టూన్‌తో అనేక భావాలు వెల్లడవుతాయన్నారు. ఆదివారం స్థానికంగా జరిగిన కార్యక్రమంలో పరిషత్ కార్యవర్గ సభ్యులు సుంకర చలపతిరావు,జి.కె.వి.రాజు,మనోహర్ పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

సీతమ్మధార: ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీ షీటర్లకు సీఐ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు హెచ్‌సీ షణ్ముకరావు కౌన్సెలింగ్ నిర్వహించారు. సమాజంలో ఎలాంటి అల్లర్లు చేయకుండా సత్ప్రవర్తనతో నడుచుకోవాలని హెచ్‌సీ సూచించారు. ఎటువంటి నేరాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ద్వారకా పీఎస్‌లో..

ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌ల్లో రౌడీషీటర్లకు ఏఎస్‌ఐ కౌన్సెలింగ్ చేశారు. తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబాలతో కలిసి హాయిగా జీవించాలని సూచించారు. ఎటువంటి గొడవలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సహృదయ సాహితి నూతన కార్యవర్గ ఎన్నిక

సీతంపేట: సహృదయ సాహితీ సంస్థ నూతన కార్యవర్గం ఆదివారం ఏర్పాటైంది. గౌరవాధ్యక్షుడిగా ఆచార్య వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి, ప్రధాన సలహాదారుడిగా డాక్టర్ ఎల్.ఆర్.స్వామి, ప్రస్తుత అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మరలా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా డాక్టర్ కె.జి. వేణు, టి.పి.ఎస్.ఆచార్యులు, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్.చినసూర్యనారాయణ, కోశాధికారిగా భాగవతుల సత్యనారాయణమూర్తి, సంయుక్త కార్యదర్శిగా కొత్తూరి రమణ ఎన్నికయ్యారు. సీహెచ్.నిర్మలాదేవి, పి.వి.ఆర్.కుమార్‌రావు, కె.వి.ఎస్.మూర్తి, కె.ఎస్.వి.రమణమ్మ, కుప్పిలి భీమేశ్వరరావు, రామతాత కార్యనిర్వాహక సభ్యులుగా ఎన్నికయ్యారు.

దేవాంగుల అభ్యున్నతికి సమష్టి కృషి

గాజువాక : దేవాంగుల సంక్షేమానికి అందర్నీ కలుపుకొని కృషి చేస్తానని విశాఖ జిల్లా దేవాంగుల సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడు బొమ్మన్న సత్యరాజ్ కుమార్ అన్నారు. గాజువాకలో ఆదివారం నిర్వహించిన దేవాంగ సంక్షేమ సంఘం ద్వితీయ మహాజన సభలో కార్యవర్గం ఎన్నిక అనంతరం ఆయన మాట్లాడారు. వస్త్రాల తయారీలో దేవాంగులది కీలక పాత్ర అని, వారి సమస్యల పరిష్కారం కలసికట్టుగా కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ, సంఘం సీనియర్ నాయకుడు ఉప్పు సత్యనారాయణ పాల్గొన్నారు.

కరకచెట్టు పోలమాంబ జాతరకు ఏర్పాట్లు

- అమ్మవారి ప్రచార రథం ప్రారంభం
- నేడు పందిరి రాట మహోత్సవం
- 4న వార్షిక పండగ

ఏయూ క్యాంపస్: శ్రీకరకచెట్టు పోలమాంబ అమ్మవారి వార్షిక జాతర మహోత్సవ ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. ఆదివారం ఉదయం ఆలయంలో ఈవో డి.వి.ఎస్.సురేష్‌బాబా, ధర్మకర్తల మండలి చైర్మన్ పిడింట్ల శంకర్‌రెడ్డి కార్యక్రమ వివరాలతో కూడిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం అమ్మవారి ఉత్సవాలకు సంబంధించిన ప్రచారం రథాన్ని ప్రారంభించారు. అమ్మవారిని పూజించే 14 గ్రామాల్లో వచ్చే నెల 4వ తేదీ వరకు ఈ రథంలో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తారు.

● మహోత్సవాలలో భాగంగా సోమవారం పందిరి రాట మహోత్సవం, పుట్టబంగారం, అమ్మవారి దేవర పండగలను నిర్వహించనున్నారు. వచ్చేనెల 3న తొలేళ్ల ఉత్సవం, 4న అనుపు మహోత్సవం జరపనున్నారు. 11న మారువారం పండగ నిర్వహించనున్నారు. 15న ఆలయంలో మహాన్నదానం ఏర్పాటు చేయనున్నారు. వచ్చేనెల 25వ తేదీ వరకు ఆలయంలో పండగ వాతావరణం కొనసాగనుంది.

● వార్షిక జాతరలో భాగంగా వచ్చేనెల 3వ తేదీ రాత్రి నుంచి తొలి పూజ, పంచామృత అభిషేకం ప్రారంభమవుతుందని ఈవో తెలిపారు. రూ.1,516 చెల్లించి ఈ పూజలో భక్తులు పాల్గొనవచ్చన్నారు. పూజకు దంపతులను మాత్రమే అనుమతిస్తామన్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా, ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక దర్శనం, విశిష్ట దర్శనం, ప్రత్యేక లఘు దర్శనం క్యూలైన్లను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రచార రథం ప్రారంభిస్తున్న ఈవో సురేష్‌బాబా, పాలక మండలి సభ్యులు

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

మద్దిపాలెం: అనుమానాస్పద స్థితిలో ఓ వివాహిత మృతి చెందిన ఘటన కంచరపాలెం కప్పరాడ అశోక్‌నగర్ వద్ద ఆదివారం సాయంత్రం జరిగింది. కంచరపాలెం పోలీసులు తెలిపిన వివారలిలా.. కప్పరాడ అశోక్‌నగర్‌లో నివసిస్తున్న శాంతికి(30) ఇషాక్‌తో ఆరేళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి ఇద్దరు 5, రెండున్నర ఏళ్ల ఆడపిల్లలు ఉన్నారు. ఆదివారం ఇంటి మేడపైకి వెళ్లిన శాంతి మూడంతస్తుల భవనంపై నుంచి పక్కనే ఉన్న మరో ఇంటి మేడపై పడింది. ఇది గమనించిన కుటుంబ సభ్యులు కంచరపాలెం పోలీసులకు సమాచారం అందించారు. సీఐ విజయ్‌కుమార్, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతురాలి తల్లిదండ్రులు సాయంత్రం వరకు ఫిర్యాదు చేయలేదని, వివాహిత ఆత్మహత్యకు పాల్పడిందా లేక ప్రమాదవశాత్తు మృతి చెందిందా అన్న కోణంలో వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న కంచరపాలెం సీఐ విజయ్‌కుమార్

మార్కెట్‌లోకి మధుర ఫలం

అల్లిపురం: అందరికీ ఇష్టమైన మధుర ఫలాలు మామిడి పండ్లు మార్కెట్లోకి వచ్చేశాయి. వాస్తవానికి వైశాఖ మాసంలో అందుబాటులోకి వచ్చే మామిడి పండ్లు నెల రోజులు ముందుగానే దర్శనమిచ్చాయి. విజయనగరం జిల్లా అలమండ నుంచి రైతులు మామిడి పండ్లు తీసుకుని వచ్చి నగరంలో అమ్మకాలు జరుపుతున్నారు. డజను రూ.250కు విక్రయిస్తున్నారు.



నీలమ్మవేపచెట్టు వద్ద అమ్మకానికి ఉంచిన మామిడి పండ్లు

మహిళా మార్టు నిర్మాణ పనులు వేగవంతం

ఆనందపురం : మండల కేంద్రం వద్ద ఏర్పాటు చేస్తున్న మహిళా మార్టు నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలను భాగస్వాములను చేస్తూ వ్యాపారం నిర్వహించడం కోసం మహిళా మార్టు ఏర్పాటు చేస్తున్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ పక్కన పాత ప్రభుత్వ భవనం స్థానంలో కొత్తగా నిర్మిస్తున్నారు. పనులు దాదాపు పూర్తి అవుతున్నాయి. మండలంలో 15,300 మంది డ్వాక్రా సభ్యులు ఉండగా ఒక్కొక్కరి నుంచి రూ.310 చొప్పున నిధులు సమీకరించారు. అందులో భవన నిర్మాణానికి రూ.100 చొప్పున కేటాయించగా వ్యాపారంలో పెట్టుబడి కోసం రూ.210లు కేటాయిస్తున్నారు. మొత్తంగా భవన నిర్మాణానికి రూ.15 లక్షలు, వ్యాపారానికి రూ.35 లక్షలు చొప్పున వినియోగించనున్నారు. ఇక్కడ మార్ట్‌లో డ్వాక్రా మహిళల ఉత్పత్తులతోపాటు రోజువారీ ఇళ్లల్లో అవసరమయ్యే వస్తువులను కూడా విక్రయిస్తారు. వ్యాపారంలో వచ్చే లాభాలను సభ్యులకు వాటాలుగా అందజేస్తారు. నిర్మాణం పూర్తి అయితే వ్యాపార కార్యకలాపాలు ప్రారంభిస్తామని ఏపీఎం నాగ భూషణం చెప్పారు.



నిర్మాణంలో ఉన్న మహిళా మార్టు భవనం

రిజిస్ట్రేషన్లకు పరిమిత స్పందన

మధురవాడ: ఆర్థిక సంవత్సరం ముగింపు నేపథ్యంలో ఆదివారం కూడా మధురవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పనిచేసింది. ఈ సందర్భంగా ఇక్కడ రిజిస్ట్రేషన్లకు కక్షిదారుల నుంచి పరిమిత స్పందన లభించింది. సబ్ రిజిస్ట్రార్లు ఎస్.మోహన్‌రావు, వెంకయ్యనాయుడు ఆధ్వర్యంలో 5 డాక్యుమెంట్లు మాత్రమే రిజిస్ట్రేషన్‌కాగా రూ.2.21 లక్షల ఆదాయం వచ్చిందని సిబ్బంది చెప్పారు.

వైభవంగా నారసింహుడికి ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 7నుంచి 8గంటల వరకు స్వర్ణపుష్పార్చన నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కల్యాణమండపంలో వేదికపై అధిష్టంపజేశారు. 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో అష్టోత్తరశత నామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ కనకరాజు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఘనంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేసి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం,జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం చేశారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేష వస్త్రాలు అందజేశారు.



కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు